ప్రజాశక్తి

గురువారం 26 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ప్రజా సమస్యలివిగో..

- ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- గుంటూరు ఛానల్‌ను పొడిగించండి
- టిడ్కో ఇళ్లు, మరో 20 వేల ఇళ్లకు పట్టాలివ్వాలి
- సర్వేలో వెలుగు చూసిన సమస్యల పరిష్కారం కోసం గుంటూరు జిల్లా కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని సిపిఎం నాయకులు కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో 20 రోజులుగా నిర్వహించిన సర్వేలో వచ్చిన సమస్యలపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు కలిసి వినతిపత్రాన్ని కలెక్టర్‌కు బుధవారం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 15 మండలాలు, 6 పట్టణాలలో 67 గ్రామాలు, 45 మున్సిపల్ వార్డుల్లో సర్వే జరిగిందని, అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. 68,948 కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, అయితే ఇంటి నిర్మాణానికి రూ.లక్ష 80 వేలే ఇస్తోందని, అయితే సిమెంట్, ఇసుక, ఇనుము, ఇతర బిల్డింగ్ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే మొత్తం బేస్ మట్టానికి కూడా చాలట్లేదని చెప్పారు. దీని ఫలితంగా 90 శాతం మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, పూర్తి చేసిన 10 శాతం మంది కూడా అప్పులతో కట్టుకున్నారని వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. తాడేపల్లి మినహా ఇతర అన్ని పట్టణాలలో

2లో

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కెఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు, ఇతర నాయకులు

రియల్టర్ల ఖుషీ

- వేగం పుంజుకున్న లావాదేవీలు
- పల్నాడు జిల్లాలోనూ పెరిగిన హడావుడి
- గుంటూరు నగరంలో అపార్టుమెంట్లకు భారీ గిరాకీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మళ్లీ ఊపందుకుంటోంది. వ్యవసాయ భూములను ఇబ్బడి ముబ్బడిగా రియల్ ఎస్టేట్‌గా వ్యాపారానికి మార్చేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని పలు మండలాలను సిఆర్‌డిఎ నుంచి ప్రభుత్వం తప్పించింది. పల్నాడు జిల్లా మొత్తాన్ని ఒకే పట్టణాభివృద్ధిగా ఏర్పాటు చేసింది. నూతనంగా పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో రియల్టర్లు హుషారుగా ఉన్నారు.

సిఆర్‌డిఎ నిబంధనల ప్రకారం ప్రతి వెంచరులో 40 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉంది. మిగతా పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వెంచర్ల నిర్మాణం రహదారుల నిర్మాణం 30 అడుగులుంటే సరిపోయేది. ఇందువల్ల రియల్టర్లకు నష్టం జరుగుతుందనే భావన ఉంది. తాజాగా పల్నాడు జిల్లాలోని 28 మండలాలు, 8 మున్సిపాల్టీలను పల్నాడు

వినుకొండ మండలం వెంకుపాలెంలో వెంచర్

పట్టణాభివృద్ధి సంస్థ (పుడా)గా ఏర్పాటు చేయడం వల్ల వెంచర్లలో 30 అడుగుల రోడ్లుంటే సరిపోతుందని రియల్టర్లు భావిస్తున్నారు. దీంతో తిరిగి పల్నాడు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమంగా పుంజుకుంటోంది.

గత రెండేళ్లుగా ఏటా లక్ష ఎకరాల వరకు సాగు చేయకుండా

2లో

కుటుంబ కలహాలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య

3లో

తెనాలి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

రియల్టర్ల ఖుషీ

(మొదటి పేజీ తరువాయి)

వదిలి వేసిన భూముల్లో దాదాపు ఐదువేల ఎకరాల వరకు ఆయా గ్రామాల్లో భూములను కొంత మంది రైతుల నుంచి రియల్టర్లు కొనుగోలు చేశారు. గతంలో పెదకూరపాడు నియోజకవర్గం మొత్తం, చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి మండలం పూర్తిగా, ముప్పాళ్ల మండలంలోని కొన్ని గ్రామాలు మాత్రమే సిఆర్‌డిఎ పరిధిలో ఉండేవి. ప్రస్తుతం వీటిని సిఆర్‌డిఏ నుంచి తప్పించడం వల్ల రియల్టర్లకు ఊరట లభించింది. వినుకొండ, నర్సరావుపేట, గురజాల, మాచర్ల నియోజకవర్గాలు పూర్తిగా సిఆర్‌డిఎ పరిధిలో లేకపోయినా ఆశించిన స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోలేదు.

నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం కొత్తగా పల్నాడు జిల్లాగా ఆవిర్భవించడంతో గత 8 నెలలుగా వినుకొండ, నర్సరావుపేట, గురజాల, మాచర్ల నియోజకవర్గాలు రియల్ ఎస్టేట్ వెంచర్లు పెరుగుతున్నాయి. ప్రధానంగా వినుకొండ నుంచి నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాల పరిధిలో ప్రకాశం జిల్లా సరిహద్దు ప్రాంతాలలోని భూముల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొత్త జిల్లాలో స్థలాల కొనుగోలుకు ఉద్యోగులు, వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

గుంటూరు జిల్లా పరిధిలో రాజధాని అమరావతి మార్పు ప్రభావం మూడేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్రంగా ఉంది. రానున్న ఏడాది కాలంలో రాజకీయంగా మార్పులు వస్తాయని భావించి అమరావతికి మళ్లీ పూర్వ వైభవం వస్తుందన్న భావనలో రియల్టర్లు మళ్లీపెట్టుబడి పెట్టి వివిధ ప్రాంతాల్లో గతంలో రూపొందించిన ప్లాన్లుకు అనుమతి పొందుతున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో కరోనా తరువాత భూములు, అపార్టుమెంట్ ధరలు గణనీయంగా పెరిగాయి. మంగళగిరి మండలంలో అపార్టుమెంట్ ధరలు 50 శాతం నుంచి 80 శాతం వరకు పెరిగాయి. భూములు ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. గుంటూరు నగరం పరిధిలో ప్రస్తుతం అపార్టుమెంట్ క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కనీసం రూ.60 లక్షలు చెల్లించనిదే ఒక ప్లాట్ దొరకని పరిస్థితి నెలకొంది. తాడికొండ, ప్రత్తిపాడు, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలో కూడా గత ఆరునెలల కాలంలో ధరలు బాగా పెరిగాయని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వెంచర్లు, ప్లాట్లుకు తిరిగి పూర్వవైభవం వస్తుందనిచెబుతున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊరట

తాజా సమాచారం ప్రకారం 2021 డిసెంబరు ఆరు నుండి అమలులో ఉన్న నిబంధనలను, జీవో 145ను ప్రభుత్వం బుధవారం ఉపసంహరించుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల పాలిట గుదిబండగా మారిన పాత జీవో నెంబర్ 145 వల్ల ప్రతి లేఅవుట్ యజమాని, ప్రైవేట్ లేఅవుట్ డెవలపర్ ద్వారా ఐదు శాతం లేఅవుట్ ప్రాంతాన్ని బలహీన వర్గాల గృహ సముదాయం ప్రాజెక్టుల కోసం సంబంధిత జిల్లా కలెక్టర్‌కి అప్పగించాల్సి ఉంది. యజమాని, డెవలపర్ చేయలేకపోతే ప్రస్తుత లేఅవుట్‌లో ఐదు శాతం అదనపు భూమిని అప్పగించడానికి, యజమాని, డెవలపర్ అసలు లేఅవుట్ నుండి 3 కిలోమీటర్ల పరిధిలో ఐదు శాతం భూమిని అప్పగించాలి. లేదా లేఅవుట్ ప్రాంతంలో ఐదు శాతం ప్రాథమిక విలువను చెల్లించాలనే ఉత్తర్వులను పున్ణపరిశీలించాలని ప్రభుత్వానికి ఏడాది కాలంగా ఎన్నో విజ్ఞప్తులు వెళ్లాయి. ఈ క్రమంలో జీవో 145ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- పొన్నూరురూరల్

పొన్నూరు పట్టణం నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన యాతాటి వెంకటప్పయ్య 2017 సంవత్సరం నుండి సంగం డెయిరిలో ప్రిపేక్ సెక్షన్‌లో జూనియర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సంగం ఎంప్లాయిస్ డెత్ రిలీఫ్ ఫండ్ నుండి సంగం డెయిరి ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశానుసారం బుధవారం రూ.16,37,373ల చెక్కును యాతాటి వెంకటప్పయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరి డైరెక్టర్ బొర్రు రామారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్లు మాదల వెంకటేశ్వరావు, నన్నపనేని ప్రభాకర్ రావు, పొన్నూరు మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బి. బాబురావు, అహ్మద్ ఖాన్, సోంబాబు, సాయి కష్ణ, రత్నకుమారి,డెయిరి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తిచేయండి

- **జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ ఆదేశం**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దీర్ఘకాలిక పెండింగ్ కేసులను సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ కోరారు. బుధవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణకు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ముందస్తు సమాచారం వుండాలని సూచించారు. కేసు దర్యాప్తు అంశాలలో, విధి నిర్వహణలో అలసత్వం చేయకూడదని జిల్లా అధికారులను ఎస్‌పి హెచ్చరించారు. కేసులు నమోదు చేయు విషయంలో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రానున్న వేసవి కాలంలో జిల్లాలో ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలు నియత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తరచూ చోరీలు జరిగే ప్రాంతాలలో రాత్రి పగలు బీట్ సిస్టంను బలోపేతం చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై కాలపరిమితిలోపు చర్యలు తీసుకొని విచారణ అంశాలను సీసీటీఎన్ఎస్ ద్వారా జిల్లా ప్రధాన కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసులకు ఆయన రివార్డులు అందచేశారు. అదనపు ఎస్‌పిలు సుప్రజ, అనిల్‌కుమార్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సీతారామయ్య ,శ్రీనివాసరావు, పోతురాజు, జేస్సి ప్రశాంతి, ప్రకాష్ బాబు, మెజేస్ పాల్ ,చంద్ర శేఖర్ రావు,విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రివార్డులు సాధించిన పోలీసులతో ఎస్‌పి ఆరీఫ్‌హాఫీజ్

భూ-సేకరణ అభ్యంతరాలపై గ్రామసభ

ప్రజాశక్తి- పెదనందిపాడు

గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించే ప్రక్రియకు ప్రభుత్వం భూ-సేకరణ కొరకు నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిపై రైతుల అభ్యంతరాలను పరిశీలించే ందుకు బుధవారం మండల తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో వరగాని గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. అబ్బినేని గుంట పాలానికి చెందిన, వరగాని జిరాయితీలో పొలం ఉన్న రైతులు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పరిశీలిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగమల్లేశ్వరరావు, గ్రామ సెక్రెటరీ పీ.విన్సెంట్‌పాల్, వరగాని గ్రామ రైతులు పాల్గొన్నారు.

27 నుంచి చందూస్ సిల్వర్‌కప్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-గుంటూరు: కళాశాల అధ్యాపకుల కోసం ప్రతి ఏటా జెకెసి, ఆర్‌విఆర్ అండ్‌జెసి ఇంజినీరింగ్ కాలేజి ఆధ్వర్యంలో జరిగే చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నీ 27వ తేదీ నుండి ప్రారంభం అవుతుందని నిర్వహణ కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు జాగర్లమూడి చంద్రమౌళి, ఆయన మనువడు మాస్టర్ చంద్రమౌళి జ్ఞాపకార్థం 1996 నుంచి ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జెకెసి కాలేజి, ఆర్‌విఆర్ అండ్ జెసి, జాగర్లమూడి నరేంద్రనాథ్ ఏసిఏ, విజ్ఞాన్ యూనివర్శిటీ మైదానాల్లో ఈ పోటీలు జరుగుతాయని, మొత్తం 27 జట్లు పాల్గొంటాయన్నారు. శుక్రవారం జరిగే ప్రారంభ కార్యక్రమంలో నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జెకెసి కాలేజి కార్యదర్శి జాగర్లమూడి మురళిమోహన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యలివిగో..

(మొదటి పేజీ తరువాయి)

18,448 టిడ్కో గృహాలు నిర్మించినా వాటిని లబ్ధిదార్లకు ఇవ్వలేదని చెప్పారు. 2016లోనే సింగిల్ బెడ్‌రూం ప్లాట్‌కు రూ.50 వేలు, డబుల్ బెడ్ రూం ప్లాట్‌కు రూ.లక్ష డిపాజిట్‌గా చెల్లించారని, వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు.

అనర్హత పేరుతో సామాజిక పెన్షన్లలో కోత విధిస్తున్నారని, జిల్లాలో 10 శాతం పెన్షన్‌దారులకు నోటీసులు జారీ అయ్యాయని, అర్హులందరికీ పెన్షన్ కొనసాగించాలని కోరారు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, పెదకాకాని తదితర మండలాల్లో గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న సుమారు 20 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. మంగళగిరి నియోజవర్గం, పెదకాకాని మండలంలో అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ పత్రాలు ఇచ్చినా ఇంత వరకు స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. తాడేపల్లి పట్టణంలో 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు ఇంకా చూపలేదన్నారు. తాడేపల్లి పట్టణంలో రైల్వే స్థలాల్లో 40 ఏళ్ల నుండి 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వీరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రాంతాలలో అస్థవ్యస్థంగా ఉన్న డ్రెయినేజి వ్యవస్థను సరిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు సరిగా లేదని, ప్రభుత్వం నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రెండో దశలో ఇళ్లు నిర్మించాల్సిన జగనన్న కాలనీల లేవుట్లకు విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించి పనులు ప్రారంభించాలని కోరారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఫిల్టర్ బెడ్స్ పనిచేయక తాగునీరు మురికిగా వస్తోందని, దీంతో స్థానికులు తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోందని, ఫిల్టర్ బెడ్లు బాగు చేయించాలని కోరారు. డెల్టా ప్రాంతంలో శ్మశాన స్థలాల సమస్య తీవ్రంగా ఉందని, దళితుల శ్మశానాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు కె.హరిబాబు సిపిఎం జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, కె.నాగేశ్వరరావు, కె.అజయ్‌కుమార్, డి.రమేష్‌బాబు, కె.శివరావు, వై.కృష్ణ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలు పరిష్కరించాలని ఎంటిఎంసి అడిషనల్ కమిషనర్ హేమమాలినిరెడ్డికి సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నిర్వహించిన సర్వేలో ర్యాంప్‌లు, రోడ్లు, డ్రైనేజీలు, ఇంకా పలు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు బృందం దృష్టికి తీసుకొచ్చారు. సిపిఎం నాయకులు కె.కరుణాకర్‌రావు, పి.గిరిజ పాల్గొన్నారు.

పెంచిన రోడ్డు టాక్స్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -మంగళగిరి

రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును భారీగా పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదకాకాని మండల డ్రైవర్స్ యూనియన్ సమావేశం బుధవారం పెదకాకాని సుందరయ్యనగర్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సిఐటియు మండల కమిటీ సమావేశరి టీ. గోపి అధ్యక్షత జరిగింది. ఈ సమావేశంలో శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రవాణా రంగా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా రవాణా రంగంపై పెనాల్టీలు, గ్రీన్ టాక్స్ ,చలానా ఫీజులు, భారీ అపరాధ రుసుముల ద్వారా వేల కోట్ల రూపాయలు బారాలు మోపారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మరి ఇప్పుడు మూడు నెలల త్రైమాక్షక పన్నును 30 శాతం వరకు భారీగా పెంచడం వల్ల టాక్సలు చెల్లించలేక వాహనాలు అమ్ముకోవడం వల్ల రవాణా రంగం పూర్తిగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వాటిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అనేకమంది డ్రైవర్లు ఇతర వర్కర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నరసింహారావు,కె లక్ష్మీనారాయణ, టి.శివ,సుబ్బారావు, శ్రీనివాసరావు ,పి.శ్రీనివాసరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నన్నపనేని శివాజి

వంశీ హైస్కూల్ విద్యార్థికి పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

సందు కోటేశ్వరరావు

ఉండవల్లి సెంటర్ వంశీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు అందుకున్నారు. ఈ నెల 24వ తేదీన గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో అండర్-11 డిస్ట్రిక్ లెవెల్ విభాగంలో వంశీ హైస్కూల్ తరఫున సందు కోటేశ్వరరావు, 1-1500 మీటర్ల విభాగంలో జిల్లా లెవెల్‌లో బంగారు పతకం సాధించారు. అలాగే, 500 మీటర్ల మెడల్స్ రింక్ విభాగంలో అండర్- 11 డిస్ట్రిక్ లెవెల్ విభాగంలో కాంస్యపతకం అందుకున్నారు. ఈ

ఓటు సామాజిక మార్పుకు నాంది

ప్రజాశక్తి-తెనాలి: ప్రజాస్వామ్యంలో ఓటు సమాజిక మార్పుకు నాంది అని, ఎంతో విలువైనదని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహశీల్దార్ కె.రవిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటు సామాజిక మార్పుకు నాంది పలుకుతుందన్నారు. ఉత్తమమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఏకైక సాధనం ఓటని చెప్పారు. మందుగా అధికారులతో ఓటర్స్‌డే ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్స్ డే సందర్భంగా నిర్వహించిన 2కె రన్, విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లిపర తహశీల్దార్ నాంచారయ్య, మండల విద్యాదికారి ఎం.లక్ష్మినారాయణ, పలువురు రెవిన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరి: 72వ జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకుని బుధవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో శ్రీయుత అసిస్టెంట్ ఎలెక్టోరల్ ఆఫీసర్ కె. హేమ మాలిని, అసిస్టెంట్ కమీషనర్.ఎం. లక్ష్మీపతిరావు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బందిచే ఓటర్ల ప్రతిజ్ఞను నిర్వహించారు. ఓటు యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగ పరుచుకుని దేశాభివృద్ధిలో భాగాస్వాములు అయ్యేందుకు ప్రజలకు అవగాహన కల్పించటమే జాతీయ ఓటర్ల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

బహుమతులందుకున్న విద్యార్థులతో సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ

దుగ్గిరాల: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని గ్రామ సెక్రెటరీ మణికంఠం అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మండలంలోని చింతలపూడికి చెందిన 92 ఏళ్ల సీనియర్ ఓటర్ డీ. నాగేంద్రంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - రొంపిచర్ల

కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గోగులపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏలూరు వెంకటేశ్వరరావు (60) ఏలూరు వీరమ్మ(55) దంపతులు బుధవారం మధ్యాహ్నం పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం తెలిపిన వివరాల ప్రకారం వద్ధ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని కుమారుడు ఇండియన్ ఆర్మీలో పనిచేస్తుండగా, కుమార్తె గ్రామంలో వాలంటరీగా పని చేస్తుందని తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతుల కుమారుడు హనుమంతరావు ఇటీవల సంక్రాంతి సెలవులకు ఆర్మీ నుండి గ్రామానికి వచ్చిన తరువాత కూడా కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకొని ఉంటారని పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిహెచ్ సురేష్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి కౌలురైతు మృతి

ప్రజాశక్తి - నూజెండ్ల

సోలార్ విద్యుత్ తీగ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మం డలంలోని కమ్మవారిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీ పంలో బుధవారం చోటు చేసు కుంది. మండలంలోని దాట్ల వారిపాలేనికి చెందిన మక్కెళ్ల వెంకటేశ్వర్లు (32) రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నారు. ఆ పొలానికి నీరు పెట్టడం కోసమని బుధవారం వెళ్లాడు. గుడి వద్ద ఉన్న మోటారు స్విచ్ ఆన్ చేసి పొలంలోకి వెళ్తుండగా ఆ మార్గంలో కింద భాగంలో ఉన్న పక్క పొలానికి చెందిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు మృతుని కుటుంబానికి సమాచారం ఇచ్చారు. అడవి పందుల బారి నుండి మొక్కజొన్న పంట కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగ తగిలి ఈ ఘటన వాటిల్లిందని మృతుని బంధువులు చెబుతున్నారు. మృతునికి భార్య, ఐదు నెలల కుమారుడు ఉన్నారు. మోటారు స్విచ్ వేసి వస్తున్నాడు. ఇంకో వైరు దారిలో కింద ఉంది. అది తగిలింది.

మాచర్లలో నేడు భారీ జాతీయ జెండావిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల : గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలో 60 అడుగుల ఎత్తులో భారీ జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు తెలిపారు. రూ.7 లక్షల మున్సిపల్ నిధులతో 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పుతో జెండాను రూపొందించామని, దీన్ని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గురువారం నిర్వహించే కార్యక్రమంలో పట్టణ ప్రజాలంతా పాల్గొనాలని కోరారు.

ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల: జిల్లా స్థాయిలో ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా మాచర్ల మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం నుండి ప్రశంసా పత్రాన్ని జిల్లా కేంద్రమైన నరరావుపేటలో బుధవారం అందుకున్నారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, అర్జీలను త్వరితగతిన పరిష్కరించడంలో ప్రతిభ చూపినందుకుగాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

ప్రణాళికా విభాగంపై ఫిర్యాదులుపై విచారణ చేపట్టామన్న ఏసీబీ డిఎస్‌పి

ప్రజాశక్తి-తెనాలి

సమయం సరిగ్గా 12 గంటలు. ఒక్క సారిగా పురపాలక సంఘ కార్యాలయంలో అలజడి. ఎక్కడి వారక్కడ గప్ చిప్..వచ్చిందో ఎవరో తెలుసుకునే సరికి అందరి గుండెల్లో రైళ్ల పరుగెత్తాయి. ఆకస్మత్తుగా దిగిన ఏసిబి అధికారుల బృందం ఏకంగా పట్టణ ప్రణాళికా విభాగంలో చొరబడింది. విజయవాడ ఏసిబి డిఎస్పీ టివి ప్రతాప్‌కుమార్ నేతృత్వంలోని బృందం తొలుత ఏసిపి-1 జడ్ సుధాకరరావు గదిలోకి చొరబడింది. అయనను తనిఖీ చేసింది. నిబంధనలకు విరుద్దంగా అతని వద్ద లభించిన రూ.4వేల పైచిలుకు సొమ్మును సీజ్ చేశారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణాలకు సంబందించి అనుమతుల రికార్డులను పరిశీలించారు. దాదాపు రెండు గంటల సాపు కొనసాగిన తనిఖీల అనంతరం డిఎస్పీ టివి ప్రతాప్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ప్రణాళికా విభాగంపై ప్రజల నుంచి అనేక పిర్యాదులున్నాయన్నారు. ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అనుమతుల్లేకుండా భవన నిర్మాణాలు కొనసాగుతున్నా మామూళ్ళ మత్తులో పట్టించుకోవటంలేదని, ప్రణాళికా విభాగం నుంచి పొందిన అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, సర్వేకు సంబంధించి కూడా దరఖాస్తులు బారీగా పెండింగ్‌లో ఉన్నట్లు పిర్యాదులున్నాయన్నారు. దీనిపై విచారణ చేపట్టినట్లు చెప్పారు ఏసిపి-1 జడ్ సుధాకరరావు వద్ద ఉన్న రూ.4, 500 నగదును సీజ్ చేశామని, అది వ్యక్తి గత అవసరాల నిమిత్తం ఉన్నట్లు ఆయన వెల్లడించినట్లు చెప్పారు. అలాగే పట్టణంలో కొన్ని భవన నిర్మాణాలను పరిశీలించామని, అనుమతులకు భిన్నంగా నిర్మాణాలున్నాయని, అయితే పట్టణ ప్రణాళికా విభాగం తనిఖీల్లో ఏం చర్యలు తీసుకున్నారో పరిశీలించాల్సి ఉందన్నారు. రెవిన్యూ విభాగంలో నివేశన స్థలాలు, కాళీ స్థలాలకు విధించిన పన్నులు నిబంధల ప్రకారం ఉన్నాయా, లేవా అన్నది పరిశీలిస్తున్నామన్నారు. సర్వేకు సంబంధించి పెద్దమొత్తంలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు పిర్యాదులున్నాయని, దానికి కారణాలను పరిశీలించాల్సి ఉందన్నారు. తనిఖీలు కొనసాగుతున్న నేపథ్యంలో సమయం పడుతుందన్నారు. ఆయన వెంట ఏసిబి సిఐలు మన్మదరావు, అరవిందబాబు, రవిబాబు, నాగరాజు, సురేష్, ఎస్ఐ శ్రీనివాసమూర్తి ఉన్నారు.

ప్రణాళికా విభాగం తనిఖీల్లో ఏసీబీ బృందం

యోగివేమన జయంతిని ప్రభుత్వ పండుగగా గుర్తింపుపై హర్షం

ప్రజాశక్తి-మాచర్ల

ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం యోగివేమన జయంతిని ప్రభుత్వ పండుగగా గుర్తించి ఆ మేరకు ప్రకటించటం పట్ల రెడ్డి జన సేవా సమితి ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక చక్రధర్ కాలేజి ఆవరణలో రెడ్డి జన సేవా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తు తీర్మానం చేశారు. ఈ విషయాన్ని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెన్నం వెంకటరెడ్డి, చెంబిరెడ్డిలు తెలిపారు. ఇటీవల మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తాడి వెంకటేశ్వం రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

ఆశాజనకంగా వరి దిగుబడులు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామంలో బుధవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగంలో ఎకరాకు 35 బస్తాల నుండి 40 బస్తాల దిగుబడి అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గతంలో కంటే వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం ద్వారా పంట బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఇఒ బి.అప్పారావు, ఎస్ బి ఐ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ అగ్రికల్చర్ వ్యవసాయ సహాయకులు ఆర్.శివగాయత్రి, రైతులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,08,337
మిర్చి ఎగుమతి	: 1,04,448
మిర్చి నిల్వ	: 65,158

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 24,000
నెం.5	9,000- 24,000
273	12,000 - 20,000
341	10,000 - 22,500
4884	13,000 - 17,500
సూపర్ 10	17,500 - 21,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 20,000
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	10,000- 21,000
తాలుకాయలు	4,000 - 13,000

NOTICE
IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE:: GUNTUR
A.S No: 125 / 2019

Between:
Narredla Siva Sankara Rao .....Appellant
AND
Narredla Srinu .... Respondent
To,
Narredla Srinu,S/o.Late Venkata Subbaiah, R/o.Naidupet,Koritepadu, Guntur Town, Guntur Dist.

పై నెంబరు అప్పీలు లో రెస్పాండెంట్ అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపనచేయుచున్నందున మీ నోటీసును ఈపేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:09-03-2023కి వాయిదా వేసినారు.కావున ఆరోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 09-03-2023

గరికపాటి రాంబాబు,
అప్పీలెంటు తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్:97014 74045

CHANGE OF NAME

I,Yalavarthy Venkata Ranga Rao (old name), s/o Seeta Ramaiah, R/o. D.No. 2-86, G.B.C. Road, Chintalapudi, Ponnur Mandal, Guntur District – 522212, changing my name from Yalavarthy Venkata Ranga Rao (old name) to YALAVARTHI VENKATA RANGA RAO (New Name), Henceforth I am being called as YALAVARTHI VENKATA RANGA RAO for all purposes.

CHANGE OF NAME

I, Kameshwari (old name), w/o Yalavarthi Venkata Ranga Rao, R/o. D.No. 2- 86, G.B.C. Road, Chintalapudi,Ponnur Mandal, Guntur District – 522212,changing my name from Kameshwari (oldname) to YALAVARTHI KAMESWARI (New Name), Henceforth Iam being called as YALAVARTHI KAMESWARI for all purpose.

CHANGE OF NAME

I, Laxmi Narafamma (old name), w/o Yalavarthi Seeta Ramaiah, R/o. D.No. 2- 87, 4th ward, Chintalapudi, Ponnur Mandal, Guntur District – 522212, changing my name from Laxmi Narafamma (old name) to YALAVARTHI LAKSHMI NARASAMMA (New Name), Henceforth I am being called as YALAVARTHI LAKSHMI NARASAMMA for all purposes.

పాసుపోర్టు పోయినది

ఊట్ల మాధవకృష్ణ S/o, ఊట్ల శ్రీనివాసరావు, నా పేరున గల పాసుపోర్టు (HYDP01366797) ది.22-01-2023 వతేదిన మా యింటి నుండి అనగా అరండల్‌పేట 3/6, సరోజిని నివాస్ అపార్టుమెంట్ నుండి పని నిమిత్తం తెనాలిలోని చెంచుపేటలో నా పాసుపోర్టు మరియు కొన్ని పత్రాలు తీసుకొన్ని బైకు పై వెళ్ళుచుండగా దారి మధ్యలో పడిపోయినవి తిరిగి ఏంత వెతికిన దొరకలేదు దొరికిన యెడల ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు.

ఇట్లు
ఊట్ల మాధవకృష్ణ
సెల్ నెం: 9494152687.

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. 439/2020 ఐ.ఎ. 438/2020
ఇన్ ఓ.యస్. 70/2013

బిట్వీన్:
వసంతరావు అన్నపూర్ణ ... పిటీషనరు - వాది
మరియు
1.సల్లగుండ్ల కనకదుర్గ మరియు 6 వగైరాలు ... రెస్పాండెండ్లు - ప్రతివాదులు
టు,
1వ ప్రతివాది-రెస్పాండెంట్: సల్లగుండ కనకదుర్గ, భర్త సోమశేఖరరావు (లేటు) నివాసం నాగార్జునకాలని, సత్తెనపల్లి పట్టణం

పై నెంబరుగల దావాను వాదులు-పిటీషనర్లు భాగపంపిణి కొరకు శ్రీసత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దావాలు చేసియున్నారు. శ్రీకోర్టువారి ద్వారా అనేక పర్యాయములు కోర్టు ద్వారా, ఆర్.పి ద్వారా నోటీసులు పంపిననూ మీరు అడ్రసులోనే ఉండి నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచు త్రిప్పి పంపుచున్నందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు పంపమని ఉత్తర్వులు ఇచ్చినందున సదరు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.01.03.2023వ తేదిన ఉదయం10.30.ని॥లకు పైకోర్టులో మీరు స్వయంగా కాని, మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. అట్లు కానియెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానం చేయబడునని మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారు ఉత్తర్వులమేరకు)

వాయిదా తేది: 01-03-2023
సత్తెనపల్లి
తేది:25-01-2023 **బి.యల్.కోటేశ్వరరావు**
పిటీషనర్స్ - వాదుల తరపు న్యాయవాది

నోటిసు
మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యమ్.వి.ఒ.పి నెం. 386/2021

బిట్వీన్:
గోళ్ళ వెంకటరమణ ..పిటిషనర్
మరియు
గోళ్ళ అన్వేష్ & 2 మంది ...రెస్పాండింట్లు
టు,
2వ రెస్పాండెంట్: శ్రీ సూరేబాలా జోషఫ్‌రెడ్డి తండ్రి రామకోటిరెడ్డి, డోర్ నెం. 3-255బి, తాళ్ళచెరువు, అచ్చంపేట, గుంటూరు.

పై నెంబరు యమ్‌విఒపి పిటిషన్లో 2వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపిచుచున్నప్పటికి వాటిని మీరు తీసుకోనకుండా ఉదేశ్వపూర్వకంగా తిప్పి పంపించుచున్నందున శ్రీకోర్టు వారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటిసులు అమలు పరుచుటకు ఉత్తర్వులు యిచ్చినందున పై కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం యి ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున ది. 02-02-2023 తేది.ఉ॥గం॥10.30 ని॥లకు మీ యెక్క హాజరు నిమిత్తం వాయిదా ఆయివున్నది. ఆరోజు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరుఅయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 02-02-2023.
విజయవాడ **శ్రీ బి.బాలనాయక్**
24-01-2023 **అడ్వకేటు, విజయవాడ**
సెల్: 9247632366

నోటీసులు
మహారాజ శ్రీ గుంటూరు 1వ అధనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో.
I.A.No:610/2017 in O.S No: 1159 / 2012

బిట్వీన్:
మొహమ్మద్ హాబిబున్నీషా వగైరాలు ...పిటీషనర్లు/వాదులు
ఎదిరి
షేక్ షకీరా బేగం ,వగైరాలు ...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To,
R-9/P-9: షేక్ ఆయేషా బేగం,భర్త.షేక్ నజీర్,
R-10/P-10: షేక్ ఆసిఫ్ ఖాన్, తండ్రి.(లేటు) పఠాన్ బాషాఖాన్,
R-11/P-11: షేక్ ఆరిఫ్ ఖాన్,తండ్రి.(లేటు) పఠాన్ బాషాఖాన్, అందరి నివాసం: బావాజీ నగర్ 1వలైను, పాత గుంటూరు , గుంటూరు(సిటీ & జిల్లా).

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం:610/2017ని to set aside abateaside చేయమని మరియు 2వ వాది యెక్క వారసులగా దావాలో చేర్చమని దాఖలు చేసిన ఐ.ఎ.లో9 నుండి11 రెస్పాండెంట్స్/ప్రపోజ్డ్ వాదులు అయిన మీకు పై కోర్టు వారి నుండి అనేక సార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు Substitute Service ద్వారా మీ నోటీసులు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:16-02-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:16-02-2023

అబిద్ అలీఖాన్ పఠాన్,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్,
గుంటూరు,సెల్:6302409986

రాష్ట్రస్థాయి పోటీలకు నకరికల్లు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - నకరికల్లు

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రంగాదేవి

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన పెద్దినిడి మల్లికార్జునరావు, రావు చరణ్‌తేజ ఎంపికయ్యారని మండల కేంద్రమైన నకరికల్లు చెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం రంగాదేవి బుధవారం తెలిపారు. ముప్పాళ్ల మండలం బొల్లవరం పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చారని, ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరు జెడ్‌పి పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు మల్లికార్జునరావు, చరణ్‌తేజ ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన వారిని విద్యా కమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి, పీడీ సిహెచ్.పుల్లయ్య, పిఇటి ఎస్‌కె.ఫాతిమా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధార్ అనుసంధానంలో ప్రతిభకు ప్రశంస

ప్రజాశక్తి - నకరికల్లు

షీల్డ్ అందుకుంటున్న కోమలి

ఓటు గుర్తింపు కార్డును ఆధార్ అనుసంధానం, ఫారం-6బి దరఖాస్తుల స్వీకరణ, ఎన్నికల క్లెయిముల పరిష్కారంలో విశిష్ట ప్రతిభ చూపిన మండలంలోని కుంకులకుంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాలపాటి కోమలి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ పత్రాన్ని విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం సిఇఒ ముఖేష్ కుమార్ మీనా బుధవారం అందించడంతోపాటు రూ.10 వేలు, షీల్డ్‌ను బహూకరించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన కుంకులగుంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జడ సౌజన్య జిల్లా రెవిన్యూ అధికారి నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వీరిని తహశీల్దార్ సురేష్ అభినందించారు.

ఏరియా వైద్యశాలలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు రామకృష్ణ, ఖాజా

పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్‌ను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కె.రామకృష్ణ, సయ్యద్ ఖాజా బుధవారం ప్రారంభించారు. డ్రెయినేజీ వ్యవస్థనూ బాగుచేయించామని, ఆక్సిజన్ ప్లాంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి అంబటి రాంబాబు త్వరలోనే ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్ర మంలో ఆస్పత్రి సూపరింటెండెంటత్ డాక్టర్ వెంకట్రావు, వైద్యులు శ్రీలక్ష్మి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా షేక్ రఫీ

ప్రజాశక్తి - నరసరావుపేట

రఫీని అభినందిస్తున్న నాయకులు

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన షేక్ రఫీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో రఫీకి పలువురు టిడిపి నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. టిడిపి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ మాట్లాడుతూ కష్ట పడి పని చేసే ప్రతికార్యకర్తకూ టిడిపిలో ప్రాధాన్యం దక్కుతుందని, రఫీ అందుకు నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జి.నాగపుర్ణచంద్రరావు, రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ జి.రామకృష్ణ, కె.విజయ్, సాల్మన్, దానియేలు, బాబు, రాజేష్, జగదీష్, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలను విస్మరిస్తే కార్యాలయాల ముట్టడి

నరసరావుపేటలో సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, పిడుగురాళ్లలో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - నరసరావుపేట

అంగన్వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే పీడీ కార్యాలయం, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి హెచ్చరించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో సిడిపిఒ సిహెచ్ ఉమామహేశ్వర్‌కు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, మరికొన్ని కేంద్రాలకు అసలు విద్యుత్ సదుపాయమే లేదని అన్నారు. టిఎ, డిఎలు ఐదేళ్లుగా చెల్లించకపోవడంతో అంగన్వాడీలు అప్పుల పాలవుతున్నారని, మరోవైపు రకరకాల యాప్‌లతో పని భారం పెంచుతున్నారని విమర్శించారు. విజిట్‌ల పేరుతో రాజకీయ నాయకులు వచ్చి అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని, దీంతో అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అంగన్వాడీ హెల్పర్ ప్రమోషన్ వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, జాబ్ కేలండర్ నిర్ణయించాలని, వేతనాలతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం.కవిత, ప్రధాన కార్యదర్శి బి.నిర్మల, కోశాధికారి సాయికుమారి, నాయకులు సిలార్ మసూద్, డి.మాధవి, రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు.

సిడిపిఒకు అంగన్వాడీల వినతిపత్రం - 6వ తేదీన ఆందోళనలకు పిలుపు

అనంతరం ఇన్‌ఛార్జి సిడిపిఒ జోష్ణకు వినత పత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, జీతంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా అమలు చేయాలని కోరారు. జగనన్న పోషణ మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. ప్రాజెక్టు కార్యదర్శి డి.శాంతమణి మాట్లాడుతూ అంగన్వాడీలను దొంగలుగా భావించే విధంగా ఫేస్ యాప్ తీసుకురావడం అన్యాయమన్నారు. గ్రేడ్-2 సూపర్వైజర్లకు వయోపరిమితి 50 ఏళ్లుగా నిర్ణయించాలని, అర్హత కలిగిన హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. వీటిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకుంటే 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని, అంగన్వాడీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఊర్మిళ, సుజాత, జయశ్రీ, శాంతి కుమారి, రమజాన్ ఆశ, వెంకటరమణ, జోష్ణ, దుర్గ, నాగమణి, భారతి, చౌడేశ్వరి పాల్గొన్నారు.

ఇల్లు కట్టాలంటే నీళ్లేవి?

సిపిఎం నాయకుల ఎదుట లబ్ధిదార్ల ఆవేదన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

లే అవుట్‌లో పరిశీలిస్తున్న నాయకులు

ఇల్లు కట్టుకోవడానికి అవసరమైన నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, నీటి మోటార్లు కాలిపోయాయని ఇళ్ల నిర్మాణ లబ్ధిదార్లు ఆవేదన వెలిబుచ్చారు. మండలంలోని ధూళిపాళ్ల సమీపంలోని లే అవుట్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ఇతర నాయకులు బుధవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న లబ్ధిదార్లతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. నీరు లేక పనులు మధ్యలోనే ఆపేశామని, వరలతో ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటి వద్ద మోటార్లు పాడవడంతో సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు చెప్పారు. పనులు కాంట్రాక్టుకు తీసుకున్న వారు క్యూరింగ్ బాధ్యత తమది కాదంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా డి.విమల మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతులు సరిగా లేవని, రోడ్లు కూడా వేయకపోవడంతో లబ్ధిదార్లు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో ఒక్కో నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో నాయకులు జి.రజిని, ఆర్.పురుషోత్తం, పి.ప్రభాకర్, సుసులోవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ పిడుగురాళ్ల మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి పి.శవశంకర్ అధ్యక్షత వహించగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి.ప్రసాదరావు, అధ్యక్షులుగా ఎంవి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా షేక్ ఫిరోజ్ బాషా, ఆర్.రత్నకుమారి, కోశాధికారిగా షేక్ బాజి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జెవిడి నాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో మార్పులు, ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి మాట్లాడారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జమాల్, మహిళా కార్యదర్శి ఆర్.రత్నకుమారి పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న జట్లు

వాలీబాల్ టోర్నీ విజేతగా నరేష్ జట్టు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాగార్జునసాగర్‌లో ఎస్పీఎఫ్ సిబ్బందికి మూడ్రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీలో నరేష్ జట్టు విజయం సాధించింది. నరేష్-ప్రవీణ్ కుమార్ జట్లు బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో తలపడగా నరేష్ జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీలో 5 జట్లు పాల్గొనగా విజేతలకు నేడు బహుమతులు ప్రదానం చేయనున్నారు. విజేతలను ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఎస్ఐ విజయ్ కుమార్, ఎఎస్ఐలు నర్సింహం, దయానంద్, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

30న వినుకొండలో జగనన్న చేదోడుకు సిఎం

ఎన్ఎస్‌పి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

చేతి వృత్తుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించేందుకు ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వినకొండకు రానున్నారు. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ కోసం స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం పరిశీలించారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పి సలాన్ని సందర్శించిన అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టేడియం, కాలేజీ స్థలాన్ని పరిశీలించారు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని శ్రీ రామలింగేశ్వర స్వామి కొండ వద్ద ఉన్న ఎమ్మెల్యే సొంత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ఎస్‌పి స్థలం, కొండ కింద తన భూమిలో బహిరంగ సభ, హెలిప్యాడ్ ఏర్పాటు కోసం పరిశీలించామని, ఎక్కడ ఏది అనేది గురువారం నిర్ణయమవుతుందని చెప్పారు. పరిశీలనలో తహశీల్దార్ కిరణ్‌కుమార్, డీఎస్పీ విజయ్ కుమార్, సిఐలు రమేష్‌బాబు, అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జాతీయ ఓటర్ల దినత్సవం సందర్భంగా స్థానిక విద్యా కేంద్రం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌డిఒ రాజకుమారి హాజరయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమైందని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యాటకంతో ఆర్థికాభివృద్ధి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

పర్యాటక ప్రాంతాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ యం.వేనుగోపాల్‌రెడ్డి అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో ఆయా ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో టూరిజం వాక్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న బోధిశ్రీ మ్యూజియం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెలవు దినాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల ఆనందంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చునన్నారు. గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రం, ఉండవల్లి గుహలు పర్యాటక ప్రాంతాలను అభివద్ధి చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు వాటి ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఐజి త్రివిక్ర వర్మ, ఏఎన్‌యు వీసీ రాజశేఖర్, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ చేతుల మీదగా బహుమతులు ప్రధానం చేశారు.కార్యక్రమంలో జెసి రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ఎఎన్‌యు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు

శకటాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు

ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయటానికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యి, ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొని, మంచి ప్రభుత్వాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఆచార్య నాగర్జున యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి రాజశేఖర్, గుంటూరు రేంజి ఐజీ త్రివిక్రమ్ వర్మ, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి పాల్గొన్నారు. ఐజీ త్రివిక్రమ్‌వర్మ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, దీనికి ఓటర్లే వెన్నెముక అన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవటంలో పట్టణ ప్రాంతాల్లోను, యువతలోను కొంత నిర్లిప్తత ఉందని, దీన్ని విడనాడాలని సూచించారు. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో ఎక్కువ మంది ఓటరుగా నమోదు కావటంలో కొంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని, జనాభా లెక్కల ప్రకారం 18 ఏళ్లునిండిన వారు దాదాపు 50 వేల మంది వరకు ఉండగా, ఎస్ఎస్ఆర్ 2023లో కేవలం 14399 మంది యువత మాత్రమే నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారన్నారు. సీనియర్ సిటిజన్స్ ఓటర్లను ఆదర్శంగా తీసుకొని యువత ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో జెసి రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రసంగించారు. సమావేశంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం నూతనంగా రూపొందించిన గీతాన్ని, భారత ఎన్నికల సంఘం చీఫ్ కమిషనరు రాజీవ్ కుమార్ ప్రసంగాన్ని ప్రదర్శించారు.అనంతరం జిల్లాలోని సీనియర్ సిటిజన్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఎస్‌వీవీఈపీ కార్యక్రమాలు నిర్వహించిన విద్యా సంస్థల ప్రతినిధులను, విధుల్లో ప్రతిభ చూపిన సూపర్వైజర్లు, బీఎల్వోలకు మెమోంటోలు, ప్రసంశ పత్రాలు అందించారు.తొలుత 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అవగాహన కోసం రూపొందించిన శకటాన్ని, ర్యాలీని కలెక్టర్, జెసి, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ చంద్రశేఖర్‌రావు, జిఎంసి అదనపు కమిషనరు పి.రోజా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఓటర్లను చైతన్యవంతులను చేస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ అని శాసనమండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణ రావు పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయ హాల్లో 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చా గోష్ఠికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. కె ఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ ప్రస్తుత ఎన్నికల విధానం స్థానంలో దామాషా ఎన్నికల పద్ధతి అమలు చేయడం ద్వారా కుల,మత, ధన, రాజకీయాలకు స్వస్తి పలకవచ్చు అన్నారు. లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ కుటుంబ, కుల,ఎ౼రసత్వ, ధన, రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని రాజకీయ పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని దీనికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామిక వాదులు ఓటర్లను చైతన్యవంతులు చేయాలన్నారు. న్యాయ శాస్త్ర ప్రొఫెసర్ ఎన్. రంగయ్య ప్రసంగిస్తూ రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం ద్వాం నే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ప్రజాస్వామ్య సూచికలో ఇండియా 93వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి. ఏ. ఆర్ సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ రాజకీయ పార్టీల గుర్తులపై గెలిచి పార్టీ మారిన వారి పదవులు వెంటనే రద్దు చేసే విధంగా సంస్కరణలు రావాలన్నారు. చట్టసభల్లో కాలపరిమితిని నాలుగు సంవత్సరాలకి కుదించాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ సామాజిక వర్గాల రాజకీయ ప్రాతినిథ్యంతోనే ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు చట్టాల నిర్మాణాలకే పరిమితం కాకుండా పాలకులుగా మారి రాజకీయ జమీందారులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతి రావు, మానవత ప్రెసిడెంట్ ఎన్.రామారావు, రేట్ పే యర్స్ అసోసియేషన్ నేత సదాశివరావు, చరిత్ర అధ్యాపకులు పాలేరు పోతురాజు,జర్నలిస్టు బత్తుల విల్సన్ ప్రసంగించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వేదికపైన వి లక్ష్మణరెడ్డి తదితరులు

స్వేచ్ఛా పవనాలు

తెల్లదొరలను తరిమికొట్టటానికి
శాంతి అహింసలు ఆయుధమ్ములుగా
సత్యాగ్రహమే అంతస్సూత్రంగా
ధర్మచక్రం పరిభ్రమణం ఆదర్శంగా
అడుగులు కదిపిన నాయకుల మార్గమే బాసటగా
స్వతంత్ర సంగ్రామం నడిచింది
కదం తొక్కిన కళాకారులు
స్వేచ్ఛా గీతం పాడిన గాయకులు
కలం కదిపిన మేధావుల ఆలోచనలు
ఊత కర్ర చేసుకున్న భరతజాతి
తెల్లవారను ముష్కరమూకలను
దేశం నుండి తరిమి కొట్టి
భరతమాత శతాబ్దాల
దాస్య శంఖలాలను తెగ నరికి
సాధించిన స్వేచ్ఛాభారతం
మహాత్ముని త్యాగనిరతికి దర్పణం
మహావీరుల ప్రాణార్పణాల వెలుగులలో
చీకటి రోజులు ముగిసిపోయి
నవ భారత నిర్మాణం జరిగింది
స్వేఛ్ఛాభారతం ఆనంద హేలలతో
రజతోత్సవ స్వర్ణోత్సవ సంబరాలు గడిచి
అమతోత్సవ పండుగను జరుపుకుంటూ
శతవసంతాల ఉత్సవాలకు పరుగులు పెడుతూ
ఎర్రకోటపై మువ్వన్నెల జెండా
గగనతలాన స్వతంత్ర గాలులలో
స్వేచ్ఛా పవనాలు వెదజల్లుతున్నది

(గణతంత్ర దినోత్సవం సందర్భంగా)

డాక్టర్ మైలవరపు లలిత కుమారి, గుంటూరు
ఫోన్ : 99595 10422

ప్రజాసమస్యలను పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి మంగళగిరి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. బుధవారం సంక్షేమ పథకాల కోతకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ధర్నానంతరం అధికారు లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా చెంగయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తుందని సంక్షేమ పథకాలు రద్దు చేయడం దారుణమని అన్నారు. విలీన గ్రామాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని వారి సమస్యలను పరిష్కరిం చాలని అన్నారు. ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను రద్దు చేయాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ మంగళగి రిలో ప్రజాస్వామ్యతంగా సమస్యలు పరిష్కా రానికి ఆందోళన చేస్తుంటే అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామాల్లో, మున్సిపాలి టీల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన అధికారులు తమ ఇష్టారాజ్యంగా ప్రజా సమస్యల పట్ల వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కనీసం వినతి పత్రాలు ఇస్తున్న తీసుకునేందుకు నిరాకరిస్తు న్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా నాయకురాలు బి కోటేశ్వరి మాట్లాడుతూ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు రోడ్లమీద పారుతుందని విమర్శించారు. అధికారులు పట్టించు కోవడం లేదని అన్నారు. అదేవిధంగా ఇల్లు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి సిపిఎం నాయకులు కే కరుణాకర్ రావు మాట్లాడుతూ తాడేపల్లి మహానాడు, సుందరయ్య నగర్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ నాయకులు ఎం బాలాజీ, టి శ్రీరాములు, ఎన్ వెంకటేశ్వరావు, షేక్ జానీ భాష, జే శివ భవన్నారాయణ, వివిధ గ్రామాల నాయకులు టీ సామిరెడ్డి, పీ గిరిజ, వద్దంటి దుర్గారావు, వల్లూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బస్సులకు చుట్టుగుంటలో బోర్డింగ్ పాయింట్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నుండి హైదరాబాద్ వెళ్లే అన్ని బస్‌లకు గుంటూరులోని చుట్టుగుంట సెంటర్ వద్ద బోర్డింగ్ పాయింటు ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. కావున గుంటూరు నుండి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు గుంటూరు బస్‌స్టాండ్‌కు రాకుండానే చుట్టగుంట వద్ద బస్ ఎక్కి నేరుగా హైదరాబాద్‌కు సుఖవంతమైన, ప్రయాణాన్ని కొనసాగించ వచ్చని, ఆటోలు ఎక్కి, వ్యయ ప్రయాసలు పడకుండా, చుట్ట గుంట వద్ద బస్ ఎక్కవచ్చని తెలిపారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : అంగన్వాడీలకు బిఎల్ఒ డ్యూటీలు, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గ్యాస్‌బిల్లులు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ సిడిపిఒకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడారు. బిఎల్ఒ డ్యూటీలు బలవంతంగా వేయడాన్ని అధికారులు మానుకోవా లని అన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 6న జిల్లా కలెక ్టరేట్ వద్ద ధర్నాను జ యప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నిమ్మకూరు రమేష్‌బాబు, ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్‌వి సుకన్య, పిడి విజయలక్ష్మి, ఎస్ సౌమ్య, జి విజయకుమారి, ఎస్ ఉషారాణి పాల్గొన్నారు.

ఉపకారవేతనాలు అందిస్తున్న లక్ష్మీ అన్నపూర్ణ, తదితరులు

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్పులు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతిభావంతులైన విద్యార్థినిలకు ఆర్థికంగా చేయూతనివ్వటం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని బొమ్మిడాల శ్రీకష్ణమూర్తి ఫౌండేషన్ ట్రస్టీ బొమ్మిడాల లక్ష్మి అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో బొమ్మిడాల శ్రీకృష్ణ తమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థినులకు ఫీజులు నిమిత్తమై రూ.1.55 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాలకు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థినిగా స్పందించి పేద విద్యార్థినులకు చేయూతనివ్వటానికి లక్ష్మి అన్నపూర్ణమ్మ ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థిని బొమ్మిడాల లక్ష్మి అన్నపూర్ణమ్మను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మల, స్కాలర్‌షిప్‌ల కమిటీ కన్వీనర్ డాక్టర్ చుక్క ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కు వినియోగం ... బాధ్యత

- ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ శివశంకర్
- వృద్ధ ఓటర్లకు సన్మానం
- యువతతో ఓటరు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్‌లో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డిఆర్‌ఒ వినాయకంలు హాజరయ్యారు. ఓట్లు ప్రాధాన్యత, కొత్త ఓటర్లు, సీనియర్ సిటిజెన్స్ ఓటు హక్కు వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని భారత రాజ్యాంగం కల్పిం చిన ఓటు హక్కును పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ, దేశ సమగ్రతను కాపాడే మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. తద్వారా దేశం, రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. భారతదేశానికీ స్వాతంత్ర్యం వచ్చిన సందర్భం, రాజ్యాంగం తయారు చేసిన విధానం, ఓటుహక్కు వినియోగం, దానిని వినియోగించు కోవాల్సిన బాధ్యత తదితర అంశాలపై యువతలో ఆలోచన రేకెత్తించే విధంగా ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నేటి యువత విద్య, ఓటు హక్కు అనే ఆయుధాలను ఉపయోగించు కోవాలని, కొత్త ఓటర్లు రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెట్టే మంచి వ్యక్తులను పాలించే వారిగా ఎన్నుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా అభివృద్ధి పదంలో నడవాలంటే యువత ప్రధాన పాత్రను పోషించాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పని సరిగా పాటించాలని, ఓటుహక్కు వినియోగం, కొత్త ఓటర్ల ఎంపిక వంటి వాటిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని, బూత్ లెవల్ అధికారులు, మండల ఎన్నికల నిర్వహణ అధికారులు, రెవెన్యూ డివిజన్ ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా ఓటర్ల జాబితాను తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్‌ను సత్కరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల నిర్వహణ విధుల్లో సమర్ధంగా పని చేసిన బూత్‌లెవల్ అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, ఉప ఎన్నికల నిర్వహణ జాబితా అధికారులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంత బాబు, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటప్పయ్య, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, నరసరావుపేట తహశీల్దార్ రమణా నాయిక్, ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు. **సత్తెనపల్లి రూరల్:** ఓటు హక్కుపై బాధ్యతగా ఆలోచించి ఎన్నికల్లో సరైన నాయకుడి ఎన్నుకోవాలని సత్తెనపల్లి ఆర్డీఓ బి ఎల్ ఎన్ రాజకుమారి విజ్ఞప్తి చేశారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం సత్తెనపల్లి విద్యా కేంద్రం డిగ్రీ, పిజి కళా శాలలో నిర్వ హిం చిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సీని యర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటర్ గుర్తింపు కార్డులు అందజేశారు. **ముప్పాళ్ల** మండల తహశీల్దార్ భవానీ శంకర్ ఆధ్వ ర్యంలో బుధవారం వృద్ధ ఓటర్లను సన్మానించారు. అధికారులు, ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ నిర్వ హించారు. **ఈపూరు:** ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈపూర్ గ్రామ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈపూరు గ్రామ సచివాలయంలో సీనియర్ సిటీజన్ ఓటర్లను తహశీల్దార్ సిహెచ్ విజయజ్యోతి కుమారి ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్ ఓటర్లు, యువత ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. **రొంపిచర్ల:** రొంపిచర్ల మండలంలో జాతీయ ఓట్ల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. **విజయపురిసౌత్ :** మాచర్ల పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రిన్సిపల్ రామకృష్ణశాస్త్రి నేతృత్వంలో మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వేముల నాగయ్య ప్రత్యేక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేముల నాగయ్య, ప్రిన్సిపల్ జేవియన్ రామకృష్ణశాస్త్రి మాట్లాడారు. పాఠశాలలో మాక్ ఎలక్షన్ నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఎస్పిఎల్, ఏఎస్పిఎల్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించామన్నారు. కెసిపి సీనియర్ జిఎం బివిపిఎస్ చౌదరి, జాయింట్ సెక్రెటరీ రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్. చిత్రంలో జెసి శ్యాంప్రసాద్ తదితరులు

కిడ్స్ పాఠశాలలో మాక్ ఎలక్షన్..

అవార్డు అందుకుంటున్న తహశీల్దార్ కె.నగేష్

సత్తెనపల్లి తహశీల్దార్‌కు అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా సత్తెనపల్లి తహశీల్దార్ కె.నగేష్ ఉత్తమ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అవార్డు అందుకున్నారు. 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్ లోఉత్తమ ప్రతిభ కనబరచిన నగేష్, కలెక్టర్ ఎల్ శివశంకర్ చేతులు మీదుగా బుధవారం ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున నగేష్ కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. సత్తెనపల్లి ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ సుజాత, డేటా ఎంట్రీ ఆపరేటర్ బ్రహ్మారెడ్డికి, బూత్ లెవెల్ అధికారులు అంకమ్మ రావు, రమేష్, సంజీవరావు,సౌజన్యలు అవార్డులు పొందారు.

బల ప్రదర్శనలో 6 పళ్ళ వృషభరాజములు

6 పళ్ళ విభాగంలో బల ప్రదర్శన

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక జిల్లా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమో రియల్ జాతీయస్థాయి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా బుధవారం 6 పళ్ళ విభాగంలో పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం నాలుగు పళ్ళ విభాగంలో జరిగిన పోటీలలో ప్రతిభ చాటిన మొదటి 10 ఎడ్ల జతల యజమానులకు నగదు బహుమతులు, అన్ని జతల యజమాను లకు కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. గురువారం ఆరు పళ్ళ విభాగంలో తలపడుతున్న ఎడ్ల జత యజమాను లను నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జి వెంకట సాంబశివారెడ్డి,బోడె అజయ్ కుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మద్ది రామ బ్రహ్మానందరావు తదితరులు పాల్గొని జ్ఞాపికలను అందజేసి సన్మానిం చారు. 6 పళ్ల విభాగంలో వివిధ ప్రాం తాల నుండి 17 జతల ఎడ్లు తల పడ్డాయి. గురువారం 8 పళ్ళ విభాగంలో బల ప్రద ర్శన పోటీలు జరుగుతాయని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

అప్పాపురం పాఠశాలలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెదనందిపాడు

జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ఈరోజు కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (చర్చ్ కాంపౌండ్)లో విద్యార్థులకు ఖోఖో, కప్ప గంతులు, కుర్చీలాట, కుందుళ్లు వంటి పలు రకాల ఆటల పోటీలు, దేశభక్తి గేయాల పోటీలను నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గేరా మోహనరావు మాటాడుతూ. ఎదగాలని కోరారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

చిత్తశుద్ధి లేని పాదయాత్రలను నమ్మొద్దు : అంబటి

ప్రజాశక్తి- అచ్చంపేట

చిత్తశుద్ధి లేని పాదయాత్రలను ప్రజలు నమ్మవద్దంటూ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు గురువారం అచ్చంపేట మండలంలో నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల అదనపు తరగతి గదులు, అదేవిధంగా అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య శాఖ మంత్రి విడుదల రజిని, పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు ప్రారంభించారు అచ్చంపేట ప్రజలు మంత్రులకు ఘనంగా బైకు ర్యాలీతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అంబటి మాట్లాడుతూ వారాహి అంటే దేవత అని అర్థం, అటువంటి దేవత పేరుతో వాహనాన్ని ఏర్పాటు చేసి అసత్య ప్రచారాలు చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అంటూ అంబటి ఘాటుగా విమర్శించారు లోకేష్ పాదయాత్రపైనా ఆయన హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు ఎంపీ లావు మాట్లాడుతూ విద్య తోనే కుటుంబాలను

ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. వైద్య శాఖ మంత్రి విడుదల రజిని అన్నారు జిల్లాలో 39 పిమెచ్‌సిలు నూతనంగా ప్రారంభమయ్యాయని, మరో7 పిహెచ్‌సిలకు అనుమతులు కూడా వచ్చాయని అన్నారు.

బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలపై ప్రదర్శన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చైతన్య గ్రామీణ బ్యాంక్ సహకారంతో అవార్డు కళాబృందం సభ్యులు బుధవారం విద్యార్థులకు బ్యాంకు ఆన్‌లైన్ లావాదేవీలు, ఉపయోగాలు, వినియోగించే పద్ధతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై చిన్న నాటిక ప్రదర్శించారు. స్థానిక పసుమర్తిలోని శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ యాసిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా క్విజ్ జేతలకు బహుమతులు అందజేశారు,

రెండు వారాలు గడువు.. ఆ తర్వాత జరిమానా

అత్యవసర కౌన్సిల్ సమావేశంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై చర్చ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిలర్ల అత్యవసర సమావేశం బుధవారం కౌన్సిల్ హాల్‌లో జరిగింది. సమావేశానికి అధికార వైసిపికి చెందిన14 మంది, ప్రతిపక్ష టిడిపికి చెందిన 8 మంది సభ్యులు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. అజెండాలోని ముఖ్యఅంశం అయిన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై చర్చించారు. ప్లాస్టిక్ కవర్లు, టీ కప్పులు, డైనింగ్ టేబుల్ పై వాడే రోల్స్, వాటర్ ప్యాకెట్లు ఫ్లెక్సీలు, బ్యానర్లు మొదలైనవి ప్లాస్టిక్ సంబంధిత 13 రకాల వస్తువులను పూర్తిగా నిషేధించాలనే దానిపై చర్చ జరిగింది. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించినా, కొనుగోలు చేసినా వెయ్యి రూపాయల నుంచి పది వేల రూపాయల వరకు అపరాధ రుసుం విధించాలని తీర్మానించారు. సమావేశంలో ఫ్లోర్ లీడర్, టిడిపి సభ్యుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిషేధిత ప్లాసిక్ కవర్లను ఉత్పత్తి చేస్తున్న ఫ్యాక్టరీలను ఆ ఉత్పత్తులను నిలిపివేయాలని, దీనిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ కవర్లపై బతుకుతున్న చిన్న వ్యాపారులపై కక్ష సాధించవద్దని అన్నారు. చైర్మన్ రఫాని స్పందిస్తూ చిన్న వ్యాపారులపై తమకు ప్రేమ ఉందని వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం తమకు లేదని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వివరణ ఇస్తూ గత కొన్ని నెలలుగా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను పెట్టుకోవద్దని వీటిని విక్రయించే చిన్న వ్యాపారులకు తాము చెబుతున్నామన్నారు. ఇప్పటికే వారి వద్ద ఉన్న వాటిని పూర్తిగా అమ్ముకునేలా చేయాలని గంగా శ్రీనివాసరావు కోరగా, రెండు వారాలు గడువు ఇచ్చిన, వాటిని పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను అనంతరం, 12వ వార్డు వైసిపి సభ్యుడు ఎడ్ల ఇందిర మాట్లా డుతూ తమ వార్డులో వందల సంఖ్యలో పేదకుటుంబాలు వున్నాయని, గత 25 రోజుల నుంచి మంచి నీరు రావడం లేదని తెలిపారు. మంచినీటికి సంబంధించి ఏ పని గురించి అడిగినా ఆ విభాగంలో పని చేసే వారు లంచం అడుగుతున్నారని ఆరోపించారు. స్థానిక పండరీపురం, చౌత్రా సెంటర్ తదితర ప్రాంతాల్లో మంచి నీటి పైపులకు లీకులు ఏర్పడ్డాయని, నీటి రంగు మారివస్తున్నాయని, ఈ విషయమై ప్రజలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నా మని పలువురు సభ్యులు చెప్పారు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న స్పైస్ స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్ క్రీడలకు ఎంపికైన పట్టణంలో గుర్రాలు చావుడికి చెందిన మహమ్మద్ ఆఫాన్‌ను కౌన్సిల్ సమావేశానంతరం అభినందనలుత తెలిపి, రూ.25 వేలు అందజేశారు.

కూలీలతో మాట్లాడుతున్న ఏపీడి శివన్నారాయణ

ఫొటోలు అప్లోడ్ చేస్తేనే ఉపాధి కూలి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు. ఫీల్డ్ లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉదయం 6 గంటలకు, 10 గంటలకు రెండుసార్లు ఫోటో అప్లోడ్ చేస్తేనే వేతనాలు అందుతాయని ఉపాధి హామీ కార్మికులకు అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో మస్తాన్ వలి, టెక్నికల్ అసిస్టెంట్ మేరీ జూలీ, ఉపాధి హామీ మేట్. టీ వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల బహూకరణలో కొర్రపాటి లక్ష్మి దంపతులు

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల బహూకరణ

ప్రజాశక్తి-తెనాలి:కరోనా సమయంలో విశేష సేవలందించిన ప్రజారగ్య విభాగం, పారిశుధ్య విభాగం సిబ్బందికి రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని పట్టణ 6వ వార్డు కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మి దంపతులు బుధవారం నూతన వస్త్రాలను బహూకరించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెచ్ నిర్మల, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్లకు నూతన వస్త్రాలను అందించారు. అలాగే 6వ వార్డులోని శానిటరి మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కొర్రపాటి శ్రీనివాస్, మొవ్వా సత్యనారాయణ, ఎం.మహేష్, తులసి పాల్గొన్నారు.

సమన ముసవిని సత్కరిస్తున్న ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్

మహిళా సాధికారతే లక్ష్యం

ప్రజాశక్తి -మంగళగిరి

మైనార్టీ మహిళా సాధికారతే లక్ష్యంగా ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో సమన చెస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. బుధవారం ప్రతిభకనపర్చిన వారిని సన్మానించే కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ కార్యలయంలో ఫ్యాషన్ డిజైనింగ్ రంగ నిపుణురాలు సమన విద్యాసంస్థల అధినేత్రి సమన ముసవిని అయన సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మైనారిటీల్లో విద్య ద్వారా సాధికారత సాధ్యం అవుతుందన్నారు. అందులోను ఫాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులను చదవటం, నేర్చుకోవడం చేస్తే ఉపాధి అవకాశాలకోసం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా స్వయం ఉపాధితో జీవనాన్ని సులువుగా కొనసాగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఆదిపి జాషువ డానియెల్, మెంబర్లు సయ్యద్ హిదయతుల్లా, షెక్ సైఫుల్లా, జింతెందర్జీత్ సింగ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బొర్డు మెంబరు అల్తఫ్ హుస్సెన్ తదితరులు పాల్గోన్నారు.

చేనేత పరిశ్రమ పూర్వ వైభవానికి కృషి

శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

ప్రజాశక్తి -మంగళగిరి

అంతరించిపోతున్న చేనేత పరిశ్రమకు పూర్వం వైభవం తీసుకువచ్చేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో రూ.2.40కోట్ల నిధులతో చేపట్టిన 120మగ్గాల షెడ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ సౌజన్యంతో నేషనల్ కాంప్రెజెన్సివ్ క్లస్టర్ డెవలప్ మెంట్ స్కీంలక్ష రూ.1.10 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30 కోట్లు కలిపి రూ.2.40కోట్ల నిధులతో 120 మగ్గాల షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. చేనేత పరిశ్రమ గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిందని, ఈ నేపధ్యంలో రాజీవ్ గహకల్పలో నివశించే పేదలు స్థలం ఉంటేనే మగ్గం నేయగలుగుతున్నారని తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివశించే చేనేత కార్మికులను యజమానులు మగ్గాలు పెట్టుకోనివ్వడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విధిలేక వృత్తినే వదలుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాజీవ్ గృహకల్పలో నివశిస్తున్న పేదలకు రానున్న మూడు నెలల్లో మగ్గాలు నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయం లో కూడా చేనేత మగ్గాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, పట్టణ వైసీపీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి.తిరుపతిరావు

బాలికల అభివృద్ధి అందరి బాధ్యత

ప్రజాశక్తి - చేబ్రోలు:బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని బచ్‌పన్ బచావోఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త జి. తిరపతిరావు అన్నారు. బుధవారం మండలంలోని శేకూరులో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్, ఆధ్వర్యంలో బాలల హక్కులు,ఉద్భవిస్తున్న సమస్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికల పై జరుగుతున్న అన్ని రకాల వివక్షతలను నిర్మూలించాలని అన్నారు. నల్లపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు వడ్లమూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఎ. నాగమణి బాలల పట్ల ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే ధైర్యంగా దగ్గరలో ఉన్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, బాగా నమ్మకమైన వారికి తెలియజేయాలని అన్నారు. క్రాఫ్ జిల్లా సమన్వయకర్త జి.వెంకయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి జె.ఫణి ప్రవల్లిక, హెచ్ అనంతలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న కెఎల్‌యు శిక్షకులు మధుసూధనరావు.

బాలికల ఆత్మరక్షణపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్:బాలికలకు ఆత్మస్థైర్యమే అసలైన బలమని కెఎల్ విశ్వావిద్యాలయంలోని ఎన్‌సిసి 22వ బెటాలియన్‌కు చెందిన లెఫ్టినెంట్ అధికారి వి. మౌనిక అన్నారు. బుధవారం బాలికల ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ తరగతులను మండలంలోని వడ్డేశ్వరం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కెఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన శిక్షకులు పి.మధుసూధనరావు బాలికలకు అపరిచితుల నుండి తమను తాము ఎలా రక్షించుకోవాలనే అంశంపైన ప్రత్యేక శిక్షణనిచ్చారు. చిత్రలేఖనంలో పోటీల్లో ప్రథమ బహుమతిని సరిగల శిరీష, ద్వితీయ బహుమతి ఎం.ప్రణీత, తృతీయ బహుమతి కె.విల్సన్ బాబులు గెలుచుకున్నారు. వీరికి గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రొ.విసి.డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఆచార్యులు డాక్టర్ సుభా కరరాజు, ఎన్.సిసిశిక్షకులుపి.మధుసూధనరావుపాల్గొన్నారు.

వారాహికి స్వాగతం పలుకుతున్న సామల నాగేశ్వరరావు

జనసేన వారాహికి ఘనస్వాగతం

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

జనసేన పార్టీ ఎన్నికల ప్రచార వాహనం వారాహికి బుధవారం కొలనుకొండ, కుంచనపల్లి హైవే వద్ద జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. జనసేన వీర మహిళలు, జన సైనికులు పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ఎదురేగి, కొబ్బరికాయలు కొట్టి, వారాహికి హారతులు ఇస్తూ, జై జనసేన అంటూ నినాదాలు ఇచ్చారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహిపై నుండి కార్యకర్తలకు నాయకులకు అభివాదం చేశారు.

తాడేపల్లి వారధి వద్ద కోలాహలం

ప్రజాశక్తి-తాడేపల్లి

కనకదుర్గ వారధి వద్ద బుధవారం జనసైనికుల కోలాహలం కనిపించింది. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి వాహనంపై గుంటూరు జిల్లాకు వెళుతుండగా వారధి వద్ద జనసైనికులు స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కార భారతి పోటీల్లో ఆపిల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల ఆపిల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు గుంటూరులో జరిగిన సంస్కార భారతి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా బుధవారం పోటీలలో బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు ఆపిల్ స్కూల్ డైరెక్టర్ అభినందన సభ నిర్వహించి అభినందించారు. ఈ పోటీలలో చిన్నపిల్లల విభాగంలో జరిగిన వివిధ రకాల విషధారణలో ఆపిల్ స్కూల్ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణలలో నిలిచి బహుమతులకు ఎంపికయ్యారు. అదేవిధంగా వివిధ రకాల ఆటల పోటీలలో పాల్గొన్న ఆపిల్ స్కూల్ క్రీడాకారులు తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించి ప్రత్యేక బహుమతులను కైవసం చేసుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను హై స్కూల్ ప్రిన్సిపల్ మోరపాకుల అజయ్ కుమార్, పలువురు అధ్యాపక సిబ్బంది,విద్యార్థులు అభినందించారు.

వేషధారణలు, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సర్దార్ సింగ్ ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

రేడియో ఆర్టిస్ట్ సర్దార్ సింగ్‌కు సత్కారం

ప్రజాశక్తి -తెనాలి రూరల్

స్థానిక బోస్ రోడ్డులోని పెమ్మసాని థియేటర్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం ఎన్టీఆర్ నటించిన యుగంధర్ తెలుగు చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాలలో భాగంగా ప్రముఖ రేడియో, టీవీ ఆర్టిస్ట్, సాంఘిక నాటక కళాకారుడు బొందిలి సర్దార్ సింగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నుపాటి లక్ష్మయ్య, కనగాల శ్రీనివాసరావు, బాజిశ్రీరామ్, పి పోతురాజు ఎం రాఘవరావు, పాల్గొన్నారు

విజయవాడ రోడ్డు పై ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

గుంతలు పడిన రోడ్ల పై టిడిపి నిరసన

ప్రజాశక్తి-తెనాలి

ప్రజలకు నరకం చూపిస్తున్న రోడ్లు దుస్థితి పై టిడిపి ఆధ్వర్యంలో బుధవారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తెనాలి -విజయవాడ రోడ్డులో ఆటోనగర్ వద్ద బైఠాయించి నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్లగా రోడ్ల నిర్మాణానికిగాని, మరమ్మతులకుగాని ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు చలనం లేదన్నారు. తక్షణమే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.హరీప్రసాద్, రావి సూర్యకిరణాలు తేజం, జె.మహేష్, కె.ఏడుకొండలు, కె.కోటేశ్వరరావు, కె.కనకరాంబాబు, పి.రమ్య పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న స్వేచ్ఛ కమిటీ ప్రతినిధి

కెఎల్‌యులో స్వేచ్ఛ ఫ్రీడమ్ ఫెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మనిషి జీవించడంలోనే కాదు టక్నాలజీ వాడే విషయంలో కూడా స్వేచ్ఛ కలిగి ఉండాలని కెఎల్ విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.శ్రీపతిరాయ్ అన్నారు. బుదవారం విశ్వవిధ్యాయ ప్రాంగణంలో కెఎల్ స్వేచ్ఛ కమిటీ నిర్వహించిన స్వేచ్ఛ ఫ్రీడం ఫెస్ట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ల వినియోగంలో లైసన్సుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడం సరికాదన్నారు. అందరికీ అందుబాటులో టెక్నాలజీ ఉంచడానికై నిరంతరం అనేక ప్రయత్నాలను చేస్తున్న కెఎల్‌యుకు స్వేచ్ఛ కమిటీ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. కెఎల్ స్వేచ్ఛ టీం అద్వర్యంలో నడుస్తున్న స్వేచ్ఛ టీం ప్రజలకు ఎటువంటి లైసెన్సులతో పని లేకుండా స్వేచ్ఛగా టెక్నాలజీని వాడుకునే విధంగా తమ వాలంటీర్లు అన్ని రంగాలలో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో అన్ని విబాగాల నుండి సుమారు 700మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.విసి.డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, స్వేచ్ఛ ప్రతినిధులు నిహారిక, సాయితేజ, మానస, లక్ష్మణ్, రవికాంత్, శ్రీకాంత్, స్వేచ్ఛ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ యశ్వంత్ కుమార్ ఆలపాటికి అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'పెర్ఫార్మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ మొబైల్ ఎడ్‌హాక్ నెట్‌వర్క్ విత్ సెక్యూర్ డేటా ట్రాన్స్‌మిషన్' అనే అంశంపై డాక్టర్ ఆర్.సుబన్ పర్యవేక్షణలో యశ్వంత్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిగిన సిబ్బంది 128 మంది ఉన్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. యశ్వంత్‌కుమార్‌ను రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు అభినందించారు.

విద్యార్థినులకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

ఆర్‌విఆర్ విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో ఆడపిల్లల ఆవశ్యకతను ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించినప్పుడే మహిళా సాధికారత సాధించవచ్చని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో విద్యార్థినులకు ప్రముఖ మహిళల జీవిత చరిత్రలతో కూడిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. దేశ చరిత్రలతో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో విజయాలు సాధించిన మహిళలను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని, ధైర్యంగా ముందుకు సాగాలని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో లేడీ అడ్వయిజరీ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.సుధావాణి, అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా వాగ్దేవి కళాశాల వార్షికోత్సవాలు

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి : పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - నరసరావుపేట

విద్యార్థులు పట్టుదలతో శ్రమించి లభించిన అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని వాగ్దేవి కళాశాలల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శివ శంకర్ సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట రావిపాడు రోడ్డు లోని వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో బుధవారం కళాశాల 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శివ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. కుల మతాలకు అతీతంగా కళాశాల రోజులు స్నేహపూర్వ కంగా ఉంటాయని, స్నేహితు లు జీవితాంతం గుర్తుండిపోతారని కళాశాల జీవితం మధురమైన జ్ఞాపకమన్నారు. కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా స్థిరపడ్డారని విద్యతో పాటు క్రమశిక్షణకు, క్రీడలకు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి కలెక్టర హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పోటు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్.కళాశాల యాజమాన్యం

సాంస్కృతిక ప్రదర్శనలో కళాశాల విద్యార్థులు

ఎస్టీ హాస్టల్లో సంక్షేమాధికారి తనిఖీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గిరిజన సంక్షేమ వసతి గహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి వరలక్ష్మి చెప్పారు. విజయపురిసౌత్‌లోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాస్టల్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా చూడాలని ఉపాధ్యాయు లకు చెప్పారు. ఇదిలా ఉండగా ఆమె మంగళవారం రాత్రి ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో బస చేశారు.

పని సర్దుబాటులో అసంబద్ధాలను సవరించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-గుంటూరు : ఉన్నత పాఠశాలల్లోని మిగులు టీచర్లు, కన్వర్షన్ ఇచ్చిన టీచర్ల సర్దుబాటులో ఉన్న అసంబద్దాలను సవరించాలని ఫ్యాప్టో ఛైర్మన్ యం.కళాధర్, ఇతర నాయకులు డిఇఒ పి.శైలజను కోరారు. ఈ మేరకు బుధవారం ఫ్యాప్టో నాయకులు డిఇఒను కలిసి వినతిపత్రం అందచేశారు. విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన సర్దుబాటు ఉత్తర్వులోని అసంబద్దాలను డిఇఒకు వివరించారు. తక్షణమే వాటిని సరిదిద్ది న్యాయం చేయాలని కోరారు. డిఇఒ సానుకూలంగా స్పందించి, అవకాశం ఉన్న మేరకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గేరా మోహనరావు, షేక్.ఖలీద్, వేళాంగిణిరాజు, కె.బసవలింగారావు, జి.వెంకటేశ్వర్లు, సిహెచ్.నరసింహారావు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

28న గుంటూరుకు సమరయాత్ర

ప్రజాశక్తి - గుంటూరు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలని తదితర డిమాండ్లపై హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకూ ఈనెల 25 నుండి ఫిబ్రవరి 4వ తేదీ వరకూ నిర్వహిస్తున్న సమరయాత్ర ఈనెల 28న గుంటూరు నగరానికి వస్తుందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం యాత్ర పోస్టర్‌న్ బ్రాడీపేటలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, తక్షణమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, గిరిజన యూనివర్సిటీ, మైనింగ్ యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖపట్నం రైల్వే జోన్ ప్రకటించాలి, రామయ్య పట్నం ఫోర్ట్, పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని, రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకి ఉద్యోగావకాశాలు కల్పించాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాత్ర గుంటూరు వస్తున్న సందర్భంగా యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నాసర్‌జి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, షేక్.వలి, ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షులు రూపస్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల నేత్రాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి - వినుకొండ

పేషెంట్లకు నాణ్యత ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను పట్టణంలోని వెన్నెల నేత్రాలయానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని నేత్ర నిపుణులు డాక్టర్ దస్తగిరి బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఢిల్లీకి చెందిన నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఎబిహెచ్) సంస్థ ఈ గుర్తింపును అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ కు చెందిన ప్రత్యేక వైద్య అధికారులు బృందం పలుదఫాలుగా వెన్నెల నేత్రలయాన్ని తనిఖీ చేయగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు గుర్తించి జాతీయ గుర్తింపును ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక గుర్తింపు వల్ల హాస్పటల్లో రోగులకు ప్రత్యేక రక్షణ, మెరుగైన వైద్యం, నర్సింగ్ కేర్ తీసుకోవడంతోపాటు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, శిక్షణ పొందిన సిబ్బందితో సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రధానంగా హాస్పిటల్లో నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా నర్సింగ్ కేర్, వివిధ కంటి వైద్య పరీక్షల స్థాయి పెంచడంలో కీలకంగా వ్యవహరించి, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు హాస్పిటల్లో వైద్య సేవలు, పాలనాపరమైన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల వల్ల వెన్నెల నేత్రాలయంకు ప్రత్యేక స్థానం లభించిందని దస్తగిరి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో పలువురు ప్రముఖులు డాక్టర్ దస్తగిరికి అభినందనలు తెలిపారు.

కొండవీడు ఇఎన్‌టిలో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - నరసరావుపేట

74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు రోడ్డులోని కొండవీడు ఈఎన్‌టి ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హస్పటల్ అధినేత, పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. 23 ఏళ్లగా జాతీయ పర్వదినాలైన జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 2 వ తేదీలలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం నిర్వహిస్తున్న శిబిరాన్ని పేద మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మూడు నెలల నుండి మూడేళ్లలోపు వయసుగల పిల్లలకు మూగ చెవుడు సమస్యలు ఉంటే గుర్తించే పరికరాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని చిన్న వయసులోనే గుర్తిస్తే మూగ చెవుడును నయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. వైద్య శిబిరంలో తమ హాస్పిటల్ వైద్య బందం డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కష్ణం నాయుడు, కె శ్రీవర్ష, ఆడియాలజిస్టులు డాక్టర్ భూలక్ష్మి, డాక్టర్ మణికంఠ, డాక్టర్ రవికుమార్ పాల్గొంటారని తెలిపారు. వైద్య శిబిరంలో ముక్కు చెవి గొంతు పరీక్షలతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులకు కూడా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నా, లేకున్నా ఎంతమందికైనా ఉచితంగా చేస్తామన్నారు చెవిటి మిషన్ అవసరమైన వారికి 30శాతం రాయితీపై అందజేస్తామని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించనునట్లు తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్ రెడ్డి

5 శాతం భూమి కేటాయింపు ఉత్తుర్వులు రద్దు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రైవేటు లేఅవుట్స్‌లో 5 శాతం భూమి పేదలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జిఒ 145ని ప్రభుత్వం రద్దు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. వెంచర్స్ యజమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పట్టణాల్లో ప్రైవేటు లేఅవుట్స్ వారు 5శాతం పేదల ఇళ్ల నిర్మాణానికి ఇవ్వాలని ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ బుధవారం జిఒ 13 జారీ చేసిందన్నారు. వివిధ వర్గాల నుండి వచ్చిన వినతుల మేరకు గత ఉత్తర్వులను రద్దు చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కావున వెంచర్స్ యజమానులు ఈ ఉత్తర్వులను వినియోగించుకొని, తమ వెంచర్లను నిర్దేశిత అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.